క్లుప్తంగా

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం



ఆలయాన్ని ప్రారంభిస్తున్న ఈశ్వరానందపురి స్వామిజీ

పావగడ: తాలూకాలోని నాగలమడక హోబళి రాయచెర్లు గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన బీరలింగేశ్వరస్వామి ఆలయాన్ని కాగినెలె మహాసంస్థాన కనక గురు పీఠాధిపతి ఈశ్వరానందపురి మహా స్వామిజీ సోమవారం ప్రారంభించారు. అలాగే రాచెర్లప్ప, ముస్లెల్లప్ప నూతన విగ్రహాలను సైతం ప్రతిష్టించారు. స్వామివార్ల ఊరేగింపులో మహిళలు పెద్ద ఎత్తున జ్యోతులు మోశారు. ఎమ్మెల్యే వెంకటేష్ ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. బీరలింగేశ్వర ఆలయ సమితి అధ్యక్షుడు సాంబసదాశివరెడ్డి, ఉపాధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చరణ్‌రెడ్డి జన్మదిన వేడుక



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సోమందేపల్లి: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ భర్త, నియోజకవర్గస్థాయి నాయకుడు చరణ్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకను సోమవారం మండల కేంద్రంలో నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కన్వీనర్ గజేంద్ర, నాయకులు జి. శ్రీనివాసులు, కంబాలప్ప, ఆదినారాయణరెడ్డి, జితేంద్ర, ప్రతాప్‌రెడ్డి, ఇమాంవలీ, పరంధామ, శ్రీరాములు, ఈశ్వర్, హరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి విగ్రహ పునఃప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో నూతనంగా నిర్మించిన వాల్మీకి మహర్షి దేవాలయంలో సోమవారం వాల్మీకి మహర్షి విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక హాజరై వాల్మీకి మహర్షికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాల్మీకి సంఘం అధ్యక్షుడు వెంకటరమణప్ప, ఆదినారాయణప్ప, శ్రీనివాసులు తదితరులు సమన్వయకర్త దీపికను శాలువాతో సత్కరించారు.

ప్రత్యేక అవసరాల చిన్నారుల గుర్తింపుపై సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

పరిగి: చిన్నారుల భవిష్యత్తుకు ప్రత్యేక భరోసా కల్పిస్తున్నట్లు ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని సీతారామ్‌పురం కాలనీలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలపై నిర్వహించిన సర్వే ప్రక్రియ పర్యవేక్షణలో వారు పాల్గొన్నారు. ఎంఈఓలు మాట్లాడుతూ ఇంట్లో నుంచి కదల్లేని వారికి హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ ఇస్తున్నామన్నారు. తల్లిదండ్రులు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను తప్పకుండా భవిత కేంద్రంలో నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ రేవతి, సీఆర్పీ అపర్ణ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రూసా భవనం తనిఖీ



రూసా భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్ధాంతరంగా ఆగిపోయిన రూసా భవనాన్ని రూసా ప్రాజెక్ట్ డైరెక్టర్లు సోమవారం తనిఖీ చేశారు. 2019లో భవనం మంజూరైనప్పటికీ భవన నిర్మాణం పూర్తికాలేదు. చేపట్టాల్సిన పనుల గురించి నివేదిక తయారు చేశారు. అనంతరం రీప్రపోజల్ తయారు చేయాలని పీఆర్‌ఈఈని ఆదేశించారు. ఆర్‌జేడీ నాగలింగారెడ్డి, పీఆర్ ఈఈ మురళీమోహన్, రాష్ట్ర కళాశాల ఉన్నత విద్యా కార్యాలయం నుంచి తిరుపతిరావు, శంకరరావు, స్థానిక కళాశాల ప్రిన్సిపల్ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం



రొద్దం: పొలంలో దుక్కి దున్నుతున్న రైతు

రొద్దం: కర్షక లోకం ఖరీఫ్ బాట పట్టింది. ఈ ఏడాది ముందస్తు కురిసిన వర్షాలకు భూములు పదునెక్కిడంతో రైతన్న సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఎడ్లతో కొందరు, ట్రాక్టర్లతో కొందరు పొలాలను దున్నుతున్నారు. పొలాల్లోని పుల్లలను ఏరుతూ వాటిని తగలబెడుతున్నారు. ఈ ఏడాదైనా పంటలు బాగా పండి తమ కష్టాలు తీరేలా చూడాలని దేవుడిని వేడుకుంటున్నారు.

ఆట విడుపు



కల్లూరు గ్రామంలోని అరుగు వద్ద చిన్నారుల సందడి

లేపాక్షి: వేసవి సెలవుల నేపథ్యంలో చిన్నారులంతా రోజంతా ఆడిపాడుతున్నారు. ఆయా గ్రామాల్లోని అరుగుల వద్దకు చేరి సందడి చేస్తున్నారు. తొక్కుడు బిళ్ల, బొంగరాలాట, చిల్లా కట్టె, గోళీలు ఆడుతున్నారు. మరికొందరు చిన్నారులు సైకిళ్లు తొక్కుతూ ఉత్సాహంగా గడుపుతున్నారు. కొద్దిగా పెద్ద పిల్లలు అయితే స్థానిక మైదానాల్లో క్రికెట్ ఆటలో మునిగితేలుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



మధూడి నుంచి కోమరేపల్లి వెళ్లే రోడ్డులో కల్వర్టు వద్దవున్న గుంత

అగళి: మండల పరిధిలోని మధూడి నుంచి కోమరేపల్లి వెళ్లే రోడ్డులో కల్వర్టు వద్ద గుంత ప్రమాదకరంగా మారింది. పొలాల నుంచి వర్షపు నీళ్లు ప్రవహించి కల్వర్టు వద్ద గొయ్యి ఏర్పడింది. మలుపు కూడా ఉండటంతో వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే రహదారికి మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

మడకశిరలో మోస్తరు వర్షం



గుడిబండ మండలం బాలేపల్లిలో కురిసిన వర్షానికి దెబ్బతిన్న పత్తి పంట



అగళి మండలం కదిరేపల్లిలో వర్షపు నీళ్లలో రాగి గడ్డి

మడకశిరరూరల్/గుడిబండ/అగళి/రొళ్ల: మడకశిర నియోజకవర్గంలో ఆదివారం రాత్రి మోస్తరుపైగా వర్షం కురిసింది. మడకశిర మండలంలో 19.6 మి.మీటర్లు, అమరాపురంలో 15.6 , గుడిబండ 69 , రొళ్ల 18.2 , అగళి మండలంలో 14.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైందని రెవెన్యూ అధికారులు తెలిపారు. గుడిబండ మండలం బాలేపల్లిలో ఓ రైతు సాగు చేసిన పత్తి పంట వర్షం దెబ్బకు కొట్టుకు పోయింది. అగళి మండలంలో గత 2 రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని కుంటలు, కందకాలల్లోకి నీరు చేరింది. చాలా చోట్ల పొలంలోనే ఉన్న రాగి గడ్డి వర్షపు నీటితో తడిచిపోయింది. వర్షాల నేపథ్యంలో రైతులు ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగుకు పొలాలను దుక్కి చేసుకోవడానికి సిద్ధం అవుతున్నారు. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా సబ్సిడీ విత్తన కాయలను సకాలంలో అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

ప్రతిభ చాటిన 'పురం' విద్యార్థిని

హిందూపురం టౌన్: కర్ణాటక రాష్ట్రం మంగళూరులోని యెనెపోయో విశ్వవిద్యాలయంలో ఈనెల 15, 16 తేదీల్లో జరిగిన ఐకాన్ యూత్–2025 అంతర్జాతీయ సదస్సులో హిందూపురం విద్యార్థిని ప్రతిభ చాటింది. ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఏ.మదీహాను ఆ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి సోమవారం కళాశాలలో అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ విద్యార్థిని అంతర్జాతీయ సదస్సులో పోస్టర్ ప్రజెంటేషన్ చేసి, గుర్తింపు పొందినందుకు తమకు గర్వంగా ఉందన్నారు. భారత ప్రభుత్వ యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ సహకారంతో జరిగిన కార్యక్రమంలో ఆధునిక యుగంలో ప్రజారోగ్య ప్రాముఖ్యంపై చైతన్యం కల్పించడంలో యువత పాత్ర అనే అంశంపై మదీహా ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా పోస్టర్ ప్రజెంటేషన్ చేసిందన్నారు. భవిష్యత్ భారతావనికి యువత ముందున్న సవాళ్లు అనే థీమ్‌తో జరిగిన ఈ అంతర్జాతీయ సదస్సులో ఎస్కే యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం నుంచి మదీహాతో పాటు, కళాశాల ఎన్ఎస్ఎస్ స్పెషల్ ఆఫీసర్ రంగనాయకులు కూడా పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల సీనియర్ అసిస్టెంట్ నరసింహులు, కార్యాలయ సిబ్బంది లక్ష్మీ, సిద్దలింగప్ప, భార్గవి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి మదీహాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రగతి, కళాశాల సిబ్బంది

దళితుడిపై దాడి జరిగితే ప్రభుత్వానికి పట్టదా?

హిందూపురం: తిరుపతి మోహన్‌బాబు కాలేజీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న జేమ్స్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు, పార్లమెంట్ ఇన్‌చార్జి కొల్లకుంట నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆబాద్‌పేటలోని పార్టీ ఆఫీసు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జేమ్స్‌పై జూనియర్ విద్యార్థులు యశ్వంత్ నాయుడు, మరికొందరు రౌడీ మూకలు కలిసి దాడి చేసి లాడ్జిలో బంధించిన ఘటనపై కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. జేమ్స్ దళితుడైనందునే వల్లనే కులం పేరుతో దూషించి రాక్షసుల్లా వ్యవహరించినా ఇంతవరకూ ప్రభుత్వం స్పందించలేదన్నారు. పోలీసులు నామమాత్రంగా కేసు పెట్టారే తప్ప నిందితులపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ , హత్యాయత్నం సెక్షన్లు పెట్టకపోవడం బాధాకరమన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. వడ్డే మంజునాథ్, కొట్నూరు గంగప్ప, నరసింహప్ప, ప్రేమ్‌నాథ్, గంగాధర్, గోపి, రాజప్ప, మధు, మోతుకపల్లి క్రిష్టప్ప, నారాయణస్వామి, భీమప్ప తదితరులు పాల్గొన్నారు.



జేమ్స్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తున్న బీఎస్పీ నాయకులు

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు మార్కెట్ చాంద్‌బాషా అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులో చికిత్స తీసుకొని హిందూపురం వచ్చారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు మహేష్ గౌడ్, బూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడు వాల్మీకి లోకేష్, ఎంపీటీసీ ధనుంజయరెడ్డి, మహిళా నేత కవితారెడ్డి, నవీన్ పాల్గొన్నారు.



చాంద్‌బాషా ఆరోగ్యస్థితిని అడిగి తెలుసుకుంటున్న సమన్వయకర్త దీపిక

ఎయిడ్స్ బాధితులపై వివక్ష వద్దు

హిందూపురం: హెచ్ఐవీ ఎయిడ్స్ బాధితులపై వివక్ష, చిన్నచూపు కూడదని అనిల్ కుమార్ కళాజాత బృందం అవగాహన కల్పించింది. స్థానిక పరిగి బస్టాండ్ ఆవరణలో హెచ్ఐవీ ఎయిడ్స్, క్షయ వ్యాధులపై అవగాహన కార్యక్రమంలో భాగంగా జాగ్రత్తలు, నియంత్రణ సూచనలను నాటకం ద్వారా ప్రదర్శించారు. ఐసీటీసీ కౌన్సిలర్లు బాబు, విమలా కుమారి, మారుతీప్రసాద్, చైతన్య సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ తిప్పేస్వామి, నవీన్, మంజుల, జయమ్మ, శ్వేత, లలిత, ముంతాజ్, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయస్వామికి జ్యోతులు మోస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం

రొద్దం: మండల పరిధిలోని బూదిపల్లిలో వెలసిన ఆంనేయస్వామికి జ్యోతుల ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అంజన్న విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం మహిళలు పెద్ద ఎత్తున జ్యోతులు మోసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలి

పరిగి: కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు శోభకు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాకు కల్పతరువులా ఉన్న ఆర్డీటీ సేవలు ఆగిపోతే పేదలందరూ ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు వస్తాయన్నారు. మంత్రి సవిత వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి, ఆర్డీటీ సంస్థ పరిరక్షణకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నారాయణ, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, జైభీమ్ పార్టీ నేత నాగరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు రమేష్, నరసింహులు, రాజశేఖర్, క్రిష్టప్ప, ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.



డీటీకి వినతిపత్రం అందిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సోమందేపల్లిలో చోరీ

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని ద్వారకామయినగర్‌లో ఆదివారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. స్థానికంగా నివాసముంటున్న అతిక్.. కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం స్వగ్రామమైన బ్రహ్మపల్లికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గుర్తించిన దుండగులు తాళాలు పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో ఉన్న ఒకటిన్నర తులం విలువైన నాలుగు బంగారు ఉంగరాలతో పాటు వెండి చెవి కమ్మలు, కాలు పట్టీలు, రూ.4 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు అతిక్ ఆవేదన వ్యక్తం చేశారు. క్లూస్ టీమ్ సభ్యులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



బీరువా పగలగొట్టిన దృశ్యం

ఓటరు జాబితా సవరణపై సమావేశం



రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన ఆర్డీఓ

పెనుకొండ రూరల్: ఓటరు జాబితాలోని సవరణలపై అన్ని పార్టీల నాయకులతో ఆర్డీఓ ఆనంద్‌కుమార్ సోమవారం కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓటరు కార్డులో సవరణలు, మార్పులు, చేర్పులపై చర్చించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, పోలింగ్ భూత్‌లలో ఏజెంట్లు నియమించి కోవాలని ఆర్డీఓ ఆనంద్ కుమార్ సూచించారు.

అస్తవ్యస్తంగా మారిన తాగునీటి సరఫరా

మడకశిర: నగర పంచాయతీ ప్రజలకు సరఫరా చేసే మంచినీటి పథకం మోటారు కాలిపోవడంతో నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. గత 13 రోజుల క్రితం మడకశిర పట్టణ సమీపంలోని చెరువు వద్ద ఉన్న బావి నుంచి పట్టణంలోని కోటవీధిలో ఉన్న ట్యాంక్‌కు నీటిని పంపింగ్ చేసి దాదాపు 40 కాలనీలకు తాగునీటి సరఫరా చేస్తున్నారు. అయితే మోటారు కాలిపోవడంతో ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పలు కాలనీల ప్రజలు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. కాలిపోయిన మోటార్ స్థానంలో వేరొకదాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు నీటి సమస్య లేకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అధిక రక్తపోటును అధిగమించాలి

పావగడ: అధిక రక్తపోటును అధిగమించి ఆరోగ్యవంతులుగా జీవించాలని స్థానిక టీహెచ్ఓ డాక్టర్ ఏఎస్ఎల్ బాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో నిర్వహించిన విశ్వ అధిక రక్తపోటు నివారణ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. అధిక రక్తపోటు శబ్దం లేకుండా చంపే అపాయకారమైన ఆరోగ్య సమస్య అన్నారు. అధిక రక్తపోటు నివారణకు ఆరోగ్యకరమైన ఆహారం, ఉత్తమ జీవన శైలి, ప్రతి నెలా రక్త పరీక్షలు చేయించుకోవడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ వైద్యురాలు శంరీన్‌భాను, సిబ్బంది చంద్రకళ, ఎండీ ఖాసీం, ఆర్ ఓంకార్, గొల్లప్ప, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

యంత్రాలతో పనులు చేయిస్తే చర్యలు

అగళి: మండల కేంద్రలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఏపీఓ మంజునాథ ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ మంజునాథ్ మాట్లాడుతూ ఉపాధి పనులను యంత్రాలతో చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. యంత్రాలతో పనులు చేస్తున్నది రుజువైతే టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బస్సు సౌకర్యం కల్పించండి

పావగడ: తాలూకాలోని అరసికెరె మార్గం నుంచి పట్టణానికి బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే స్థానిక కేఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ శివలింగప్పకు సోమవారం వినతిపత్రం అందించారు. విద్యార్థి నాయకుడు అనిల్ మహదేవ్, సాగర్, సోమశేఖర్, రాజేష్, విరుపాక్ష, ధనుశ్, చిరంజీవి, అభిలాష్, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పెను'కొండ'పై మొక్కలు

పెనుకొండ: పట్టణంలోని చారిత్రాత్మకమైన పెనుకొండ కొండపై పలువురు కూలీలు సాహితీ గగన్ మహల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో మొక్కలు నాటితే పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో ఉపయోగపడతాయన్న ఉద్దేశంతో ఆ ట్రస్ట్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి మొక్కలు నాటిస్తున్నారు. ఈ ఏడాది కొండపై పచ్చదనం పెంచాలన్న లక్ష్యంతో 5 వేల మొక్కలు నాటిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ 800 మొక్కలు నాటామని, మరో 4200 మొక్కలు నాటించాల్సి ఉందన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

లేపాక్షి: స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ వెంకటరత్నమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిదులు, మండలాధికారులందరూ తప్పక హాజరుకావాలని కోరారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి

పెనుకొండ: పట్టణంలోని సివిల్ సప్లయ్స్ గోడౌన్‌లో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బాబావలి, సివిల్ సప్లయ్స్ హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ దేశంలో కూలీ సంఘాలు ఏర్పాటు చేసి కూలీ రేట్లు పెంచాలని పోరాడారని పేర్కొన్నారు. నాయకులు సుధాకర్, హనుమంతు, శివ, ఓబులేసు, ముత్యాలు, అక్కులప్ప, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వివిధ సమస్యలపై అర్జీల స్వీకరణ

పెనుకొండ రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై నాలుగు అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లి గ్రామ సచివాలయాన్ని సోమవారం ఎంపీడీఓ వెంకటలక్ష్మి తనిఖీ చేశారు. సిబ్బంది విధులకు సక్రమంగా హాజరై ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. అనంతరం చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని కూడా పరిశీలించారు. పారిశుధ్యం పనులపై దృష్టి సారించాలని పంచాయతీ అధికారులు ఆదేశించారు.



ఉష్ణోగ్రత సమాచారం

హిందూపురం	32.0
పెనుకొండ	34.0
మడకశిర	32.0

ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోండి

హిందూపురం టౌన్: పట్టణంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా ముందస్తు ప్రచారం చేస్తూ అడ్మిషన్లు నిర్వహిస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఏ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఏ నాయకులు విజయ్, శ్రీరామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సకు వెళ్లిన వృద్ధులు

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురం నుంచి హిందూపురం పట్టణానికి సోమవారం 35 మంది వృద్ధులు కంటి శస్త్ర చికిత్స కోసం వెళ్లారు. ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో ఆదివారం కంటి పరీక్షలు నిర్వహించారు. దీంతో వారందరికీ ఉచితంగా కంటి ఆపరేషన్ నిర్వహించేందుకు తీసుకెళ్లినట్లు డాక్టర్ బసవరాజు తెలిపారు. హిందూపురంలోని సాయి నేత్రాలయంలో ఉచిత కంటి ఆపరేషన్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

పరిగిలో తిరంగా ర్యాలీ



పరిగిలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

పరిగి: 'ఆపరేషన్ సింధూర్' విజయం భారత ప్రజలందరికీ దక్కుతుందని బీజేపీ నాయకుడు వేణుగోపాలరావు అన్నారు. మండల కేంద్రం పరిగిలో ఆపరేషన్ సింధూరు విజయాన్ని పురస్కరించుకుని తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఇండియన్ డిజైన్స్ గార్మెంట్స్ పరిశ్రమ మహిళలతో పాటు బీజేపీ శ్రేణులు ర్యాలీలో పాల్గొన్నారు.

రేపు రొళ్లలో 'తిరంగా యాత్ర'

రొళ్ల: 'ఆపరేషన్ సింధూర్' విజయాన్ని పురస్కరించుకుని సైనికులకు సంఘీభావంగా బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణం నుంచి భారత శౌర్య తిరంగా యాత్ర నిర్వహించనున్నట్లు స్థానిక బీజేపీ నాయకుడు సీఎం ఘట్ట ముద్దరాజు తెలిపారు. దేశభక్తులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎస్ఐ రంగడుయాదవ్

పరిగి: మండల కేంద్రం పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది. స్థానిక దివ్య ఎడ్యూకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చైర్మన్ వేణుగోపాలరావు నేతృత్వంలో జరిగిన ప్రారంభోత్సవానికి ఎస్ఐ రంగడుయాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. టోర్నమెంట్ విజేతకు రూ.10 వేలు , రన్నరప్‌కు రూ. 5 వేలు అందిచనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా బ్రహ్మ రథోత్సవం



లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పెనుకొండ: పట్టణంలో లక్ష్మీవెంకటేశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి పట్టణంలోని పలు వీధుల గుండా స్వామి విగ్రహాన్ని రథంలో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు.